క్లుప్తంగా

29న గంగమ్మతల్లి వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం శాంతినగర్ కాలనీలో వెలసిన శ్రీ ఏరువాక గంగమ్మతల్లి 26వ వార్షికోత్సవం ఈ నెల 29వ తేదీన నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

నేడు వేంపల్లెకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రాక

వేంపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం వేంపల్లెకు రానున్నట్లు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డిలు తెలిపారు. మంగళవారం ఉదయం 7గంటలకు వేంపల్లె పట్టణ పరిధిలోని చింతలమడుగుపల్లె గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభించి అనంతరం వేంపల్లెలోని గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించనున్నారని తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి: రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని రంపతాడు, మమ్ముసిద్దుపల్లె, జంగంరెడ్డిపల్లె గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డిలు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు.

పులివెందుల ఆర్టీసీ డీఎంగా రామకృష్ణారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డీఎంగా రామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి విశాఖపట్టణంకు బదిలీ అయ్యా రు. ఆయన స్థానంలో మైదుకూరు ఆర్టీసీ డీఎంగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి పులివెందుల ఆర్టీసీ డీఎంగా బాధ్యతలు చేపట్టారు.

మద్యం షాపు తొలగించాలని వినతి

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని సోమవారం బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల ఓబయ్య తహశీల్దార్ ఉదయ భాస్కర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆ షాపును తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రింటర్ వితరణ

వేంపల్లె : స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రానికి దాతలు వితరణగా ప్రింటర్, వాటర్ ట్యాంక్‌ను అందజేసినట్లు ఐఈఆర్టీ యశోద తెలిపారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ఎంఈఓ వీరారెడ్డి సమక్షంలో పెద్దిరెడ్డి గంగిరెడ్డి జ్ఞాపకార్థం స్వర్ణకుమారి, పెద్దిరెడ్డి శ్రీరామరెడ్డిలు రూ.12వేలు విలువ చేసే ప్రింటర్‌ను వారి కుమార్తె భవిత, కుమారుడు పురుషోత్తమరెడ్డిల చేతులమీదుగా అందజేశారు. అలాగే హరీష్ ఎలక్ట్రికల్స్ వారు రూ.5 వేలు విలువ చేసే వాటర్ ట్యాంక్‌ను అందించినట్లు చెప్పారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన

వేంపల్లె : స్వచ్ఛ భారత్ సిబ్బందికి వేతనాలు విడుదల చేయాలని హరిత రాయబారులు, జగనన్న క్లాప్ మిత్రలు నిరసన తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు.

భూ రీసర్వే పక్కాగా చేపట్టాలి

ముద్దనూరు: చిన్న దుద్యాలలో జరుగుతున్న భూ రీసర్వే అవకతవకలు లేకుండా పక్కాగా చేపట్టాలని రైతులు సోమవారం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. రీ సర్వేలో పలుచోట్ల ఆన్‌లైన్‌కు, ఆర్‌యస్‌ఆర్‌కు విస్తీర్ణంలో తేడాలు కనిపిస్తున్నాయని విన్నవించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

వల్లూరు: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. వల్లూరు మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె గ్రామం నుండి వల్లూరుకు వెళ్లే అప్రోచ్ రోడ్డులో జింకల వంకపై నిర్మించనున్న కల్వర్టు నిర్మాణానికి సోమవారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రూ. 38 లక్షల సీఎం డెవలెప్‌మెంట్ నిధులతో నిర్మించనున్న ఈ కల్వర్టు నిర్మాణానికి వేద పండితుల పూజల అనంతరం వారు కొబ్బరి కాయలను కొట్టి భూమి పూజ నిర్వహించారు. అనంతరం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఒక పక్క సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మరో పక్క అభివృద్ధికి సైతం అంతే ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే వినతుల మేరకు ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ కల్వర్టు నిర్మాణం కోసం స్థానిక ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు పరిశీలన చేసి కల్వర్టు ప్రాధాన్యతను గుర్తించి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దీని వలన గ్రామ ప్రజలకు పొలాలకు వెళ్లడానికి, వల్లూరుకు వెళ్లడానికి సౌకర్యవంతంగా వుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులు రెడ్డి, సర్పంచ్‌లు ఓబుల్‌రెడ్డి, రాజన్న, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఓబుల్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, క్రిష్టారెడ్డి, చంద్రా రెడ్డి, ఎంపీడీవో జుబేద, అధికారులు పాల్గొన్నారు.


కల్వర్టు నిర్మాణ పనుల భూమి పూజలో పాల్గొన్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

బాధ్యతల స్వీకరణ

వల్లూరు: వల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పీవీ భాస్కర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పిస్తూ వల్లూరు ఏవోగా బదిలీ చేశారు.

మరణించిన వారి ఓట్లు తొలగించాలి

జమ్మలమడుగు: మరణించిన వారు, వలసలు వెళ్లిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించి కచ్చితమైన ఓటర్ల జాబితాను తయారు చేయటానికి అధికారులందరూ కలిసికట్టుగా విధులు నిర్వహించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ఎలక్షన్ టీడీ, వీఆర్వో, డేటా ఆపరేటర్‌లతో ప్రత్యేక సమావేశాన్ని ఆర్డీఓ ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి జనవరి నాటికి కొత్త ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

వేంపల్లె : వేంపల్లె పట్టణ అభివృద్ధి లో భాగంగా ప్రభుత్వం రూ. 13.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక నాలుగు రోడ్ల కూడ లి నుంచి గండి రోడ్డులోని భారత్ పెట్రోలు బంకు వరకు వెడల్పు చేసేందుకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న ఉత్తర్వులు జారీ చేశారు. నా లుగు రోడ్ల లైన్ వెడల్పు, సిమెంటు రోడ్లు, అండర్ డ్రైనేజీ, లైటింగ్, డివైడర్లు, లైటింగ్ కలిపి ఈ నిధు లు మంజూరయ్యాయి.

గోవుల అక్రమ రవాణా ఆపాలి

ఎర్రగుంట్ల : గోవుల అక్రమ రవాణా ఆపాలని, గోవులను వధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు, ఎస్ఐ వెంకటక్రిష్ణయ్యలకు వారు వినతి పత్రం అందించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

వేంపల్లె : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయిల్ డిక్సన్ కంపెనీ వారు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ చదివిన యువతులు 252మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. 149మంది ఎంపికయ్యారన్నారు.

పెండ్లిమర్రి: నిరుద్యోగ యువతులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. వెలుగు కార్యాలయంలో సోమవారం పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో ఆల్ డిక్సన్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 355 మంది హాజరయ్యారు.

మాదక ద్రవ్యాలు తీసుకోవడం నేరం

కమలాపురం: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, ఇలా డ్రగ్స్ తీసుకోవడం చట్టరీత్యా నేరం అని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య తెలిపారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాదవ ద్రవ్యాల వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, పుష్పరాజు పాల్గొన్నారు.

వల్లూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యర్రగుంట్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్లో సోమవారం మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ బాబు, ఎస్ఈబీ ఎస్ఐ శశిధర్ పాల్గొన్నారు.

యువత మేలుకో.. భవిష్యత్‌ను మలుచుకో

పులివెందుల టౌన్ : యువత మేలుకుని డ్రగ్స్ వదిలి భవిష్యత్‌ను మలుచుకోవాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ మెయిన్ జూనియర్ కళాశాలలో ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ హుస్సేన్, సత్యనారాయణలు హాజరయ్యారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ అమల్ రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


కమలాపురం: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మెజిస్ట్రేట్ లావణ్య


పులివెందుల టౌన్ : మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్

మాదక ద్రవ్యాలతో అనర్థాలే ఎక్కువ

సింహాద్రిపురం : మాదక ద్రవ్యాలతో అనర్థాలే ఎక్కువ అని ఎస్ఐ రోషన్ పేర్కొన్నారు. సోమవారం సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ, లెక్చరర్లు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావద్దు

ముద్దనూరు: యువత భవిష్యత్‌ను కాపాడుకోవాలని సీఐ నరేష్ బాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చెన్నారెడ్డి సూచించా రు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్న త పాఠశాలలో మత్తుపదార్థాల వినియోగం.. వాటి వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

స్మార్ట్ మీటర్ల నిర్ణయం ఉపసంహరించుకోవాలి

జమ్మలమడుగు: దేశంలోని నరేంద్రమోడీ పాలనలో దేశప్రజలపై పన్నుల భారం తప్ప ప్రజా సంక్షేమం ఏమాత్రం పట్టించుకోవడంలేదని అఖిల పక్ష నాయకులు విమర్శించారు. సోమవారం స్మార్టు మీటర్ల ఏర్పాటు, ట్రూఅప్ చార్జీలు, విద్యుత్‌చార్జీల పెంపునకు నిరసనగా పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం, సబ్‌స్టేషన్ వరకు ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ జి.శ్రీనివాసులకు , విద్యుత్ ఏడీలకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శివనారాయణ, కాటా రామదాసు, భూతమాపురం సుబ్బారావు, వెంకట స్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని, రాష్ట్రం సుభిక్షంగా ఉందని గిద్దలూరు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు కొప్పుల నరసింహులు తెలిపారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని చేస్తున్న తిరుమల పాదయాత్రలో భాగంగా సోమవారం చెన్నూరు వచ్చిన ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

మమ్మల్ని రెగ్యులరైజ్ చేయండి

పులివెందుల : వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సోమవారం కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని.. అయితే ప్రభుత్వ జీఓవల్ల పదేళ్లుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ కాలేదని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎంపీ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళతానన్నారు.

మమ్మల్ని ప్రభుత్వ ఆప్‌కాస్‌లో చేర్చండి..

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఏపీ కార్ల్‌లో పనిచేస్తున్న 25మంది వాచ్‌మెన్లు కలిశారు. ఈ సందర్భంగా వారు గత పదేళ్ల నుంచి డైలీ వేతనం కింద పనిచేస్తున్నామని.. తమను ప్రభుత్వ ఆప్‌కాస్‌లో చేర్చాలని కోరారు. దీనికి ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

రక్తనిధి సిబ్బందికి న్యాయం చేయండి..

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ రక్తనిధి సిబ్బంది కలిశారు. ఈ సందర్భంగా వారు 2006 నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని... తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. దీనికి ఎంపీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని భరోసా ఇచ్చారు.


సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అంకితభావంతో పనిచేయాలి

పులివెందుల రూరల్ : వృత్తిలో అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సాధించవచ్చునని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని పాడా ఓఎస్డీ కార్యాలయంలో ఏడీఏ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంఏఓలు, ఏఏఓలు, ఎంహెచ్ఓలు, హెచ్ఓలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో పీఎం కిసాన్, ఈ–క్రాప్, ఫర్టిలైజర్ సేల్ తదితర వాటిలో ఎక్కువ కృషి చేసిన ఆర్‌బీకేల వ్యవసాయ సిబ్బంది స్వాతి, సాయిప్రసన్న, ఎస్.హుస్సేన్‌లకు మెమెంటోలను అందించి ప్రసంశించారు. ఈ సందర్భంగా ఏడీఏ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, పాడా అకౌంట్స్ ఆఫీసర్ నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ సిబ్బంది స్వాతికి మెమెంటోను అందిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

విద్యార్థులకు బహుమతులు

వేంపల్లె : పట్టణంలోని తలిశెట్టి సుబ్రమణ్యం బాలుర ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ రాజశేఖర్ అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి రూ.3వేలు, రూ.2వేలు, రూ. 1000 నగదు బహుమతులను అందించారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

చెన్నూరు : రుద్రభారతి పేటలో దొంగ డి-ఫారాలు సృష్టించి ప్రభుత్వ స్థలాలు, పేదల ఇంటి స్థలాలను కొంతమంది కబ్జా చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్‌ఆర్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, పొట్టి పాటి ప్రతాపరెడ్డి, హస్రత్ సోమవారం స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చిన్న మాచుపల్లి రెవిన్యూ పరిధిలోని రుద్ర భారతి పేటలో 2003లో చెన్నూరు, చిన్నమాచుపల్లికి చెందిన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అయితే అక్రమార్కులు దొంగ డి-ఫారాలతో పేదల స్థలాలు స్వాధీనం చేసుకొని అమ్ముకున్నారన్నారు. దొంగ రేషన్ కార్డులు సృష్టించి దాదాపు 100 బిల్డింగులు దాకా మంజూరు చేయించుకున్నారని వివరించారు.

అక్షరాభ్యాసం

సింహాద్రిపురం : కోవరంగుంటపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన సోమ వారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంగా మహేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి

– ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

కొండాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె. సుధీర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. కొండాపురంలోని రామసుబ్బారెడ్డినగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలను వారికి వివరిస్తూ కరపత్రం అందజేశారు. ఇంకా ఇవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధాల హామీలతో ప్రజల ముందుకు వస్తారని.. ఎవ్వరూ నమ్మవద్దన్నారు. రామ సుబ్బారెడ్డినగర్ కాలనీలో సిమెంట్ రోడ్లు వేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చింతా రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి, కొండు వాసుదేవ రెడ్డి, కొండు రామిరెడ్డి, రామాంజినేయుల్ రెడ్డి, బుజ్జి, ఎర్రబాషా, వినోద్ రెడ్డి, చోటు, చింత నవజ్యోత్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ నాగప్రసాద్ పాల్గొన్నారు.

రజకులకు ఆర్థిక సాయం

ఎర్రగుంట్ల : చిలంకూరు గ్రామానికి చెందిన రజకులకు జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ బయట ఉన్న రజకులు తమ బాధను ఎమ్మెల్యేతో విన్నవించారు. దోబీఘాట్‌లో దుస్తులు ఉతుక్కుంటూ జీవనం సాగిస్తున్నామని.. అయితే సోమవారం దోబీఘాట్ వద్ద ఉన్న దుస్తులు నిప్పురవ్వలతో కాలిపోయాయని.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వచ్చామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ ఎరికల రెడ్డి, కాంట్రాక్టర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

వీరపునాయునిపల్లె: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొమ్మద్ది, వెల్దుర్తి సచివాలయాల పరిధిలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, జేఏసీ కన్వీనర్ వీరప్రతాప్‌రెడ్డి , ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమ్మద్ది ఎంపీటీసీ రామాంజనేయులు, వెల్దుర్తి సర్పంచ్ విశ్వనాథ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు: గ్రామ సచివాలయాలలోనే పదకొండు రకాల సేవలను పొందవచ్చు అని మండల ప్రత్యేకాధికారి డి.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పి.బొమ్మెపల్లిలో జగనన్న సురక్షపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రామనాథ్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఎంపీడీఓ పరిపూర్ణ అరుంధతి, వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఎర్రగుంట్ల : ఇండియా సిమెంట్స్ ఆధ్వర్యంలో మొబైల్ క్యాంప్ ద్వారా ఇంటింటికి వెళ్లి ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని, ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని యర్రగుంట్ల ఐసీఎల్ వీపీ మారిముత్తు తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య నగర్ కాలనీలో ఈ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మొబైల్ క్యాంప్ వారం రోజుల పాటు ఎర్రగుంట్ల పట్టణంలోని పలు కాలనీలలో నిర్వహిస్తామన్నారు.



రెండు రోజుల్లో కనెక్షన్లు ఇచ్చుకోవాలి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి ముందర ఉన్న చాంబర్లకు రెండు రోజుల్లో కనెక్షన్లు ఇచ్చుకోవాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణ పరిధిలోని గోపివిహార్ వీధి, నగరిగుట్ట ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ కాలనీ నుండి తూర్పు ఆంజనేయస్వామి గుడి వద్ద వరకు వర్షపునీరు పోయే కాలువలో బాత్రూం పైపులు వదిలిన ఇంటి యజమానులకు రెండు నెలల క్రితమే పైపులను తొలగించి చాంబర్లకు కనెక్షన్లు ఇచ్చుకోవాలని నోటీసులు ఇచ్చామన్నారు. కానీ ఇంతవరకు ఎవరేకానీ చాంబర్లకు కనెక్షన్లు ఇచ్చుకోలేదన్నారు. రెండు రోజుల్లో ఇంటి ముందర ఉన్న చాంబర్లకు కనెక్షన్లు ఇచ్చుకోకపోతే సదరు పైపులకు డమ్మీలు వేస్తామని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మున్సిపల్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

